


# ధర్మవడ్డీ

- గోపీచంద్

**నేనా ఊరు ఎందుకు** వెళ్ళానో, నాకిప్పుడు జ్ఞాపకం లేదు.

కాని, వెళ్ళటం చిన్నప్పటి స్నేహితుడు కనపడ్డం, తన ఇంటికి నన్ను తీసుకువెళ్ళటం జరిగింది. కలవక కలుసుకోవడం వల్ల, చిన్నప్పటి విషయాలు తలుచుకుని నవ్వుకుంటూ ఉన్న సమయంలో అతడొచ్చాడు. రావటం రావటం ఎలా వచ్చాడని?

ముందు వాకిలి నెమ్మదిగాతెరిచాడు. కుడికాలు గడపలో పెట్టి అటూ ఇటూ దొంగ చూపులు చూశాడు. చంకలో ఉన్న మూటని పదిలంగా రెండో చేత్తో పటుకుని, తల ఒరగా పెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ, నా స్నేహితుని దగ్గరకు వచ్చి చంకలో మూట అందిస్తూ, "ఇదిగోనోయ్, డబ్బూ" అన్నాడు.

అసలు అతన్ని చూడగానే నా స్నేహితునికి ముఖ కవళికలు పోయినై. అంతకు ముందున్న సంతోషం మాయమైపోయింది. నెమ్మదిగా మూటందుకుంటూ "మనిషంటే మనిషివి నువ్వే సూరయ్యా! నిఖార్సయిన మనిషివి" అన్నాడు.

ఈ మాటకు సూరయ్య సంతోషం పైకి కనపడనివ్వకుండా "మాటలకేంలే! డబ్బు తీసుకోగానే కాదు. నెలరోజులలో అసలు ఫాయిదాలు ఇచ్చి వేయాలి. వడ్డీ నీకు తెలిసిందేగా - ధర్మవడ్డీ - నెలకు నూటికి రూపాయిన్నర. అదైనా నువ్వని ఇస్తున్నాను" అన్నాడు.

"అలాగే సూరయ్యా, నెలదాటకముందే ఇస్తాను" అన్నాడు నా స్నేహితుడు.

"ఇస్తానంటే కాదు. మాట చెల్లించుకోవాలి. శుభకార్యం ఒకటి తలపెట్టావా? మంచికీ చెడుకీ డబ్బు కావాల్సి వస్తుంది. తర్వాత కోర్టూ గిర్టూ అంటే... "

"అదేమిటి సూరయ్యా! నీ దగ్గర ఎన్ని సార్లు డబ్బు తీసుకోలేదు. ఎన్ని సార్లు ఇవ్వలేదు. ఎప్పుడైనా మాట తప్పేలు వచ్చిందా?"

"సరేలే, డబ్బు లెక్కపెట్టుకో, అన్నీ రూపాయలే. కొద్దిగా మాత్రం చిల్లర వుంది. మళ్ళీ నాకు రూపాయలే ఇవ్వాలి సుమా! నోట్లూ గీట్లూ అంటే కుదరదు."

"నువ్వు చెప్పాలా, సూరయ్యా" అంటూ నా స్నేహితుడు మూట విప్పాడు. చూసేటప్పటికి నా తల తిరిగి పోయింది అయోమయం అయిపోయింది. ఆ మూటలో ఉన్నవన్నీ రాళ్ళే చిన్న చిన్న రాళ్ళూ, పెద్ద పెద్ద రాళ్ళూ - పెద్దవన్నీ కంకరరాళ్ళూ చిన్నవన్నీ గులకరాళ్ళూ! నమ్మలేక నా స్నేహితుని మొహం పరీక్షగా చూశాను. అతడు మాత్రం ఇదంతా లెక్కచెయ్యకుండా అతి జాగ్రత్తగా ఆ రాళ్ళని తీసి ఒకొక్కటే లెక్కపెడుతూ కూర్చున్నాడు.

నాకేమీ తోచక సూరయ్యవంక చూశాను. అతనింకా తల ఒరగానే పెట్టి లెక్కపెట్టబడుతూ ఉన్నరాళ్ళను రెప్పవెయ్యకుండా పరీక్షిస్తున్నాడు. ఇంతలో నా స్నేహితుడూ లెక్క పూర్తిచేసి, "సరిపోయినయి, సూరయ్యా" అన్నాడు.

"ఇవాళ సరిపోయినై అంటే కాదోయ్. ఇవ్వాళ ఇరవై, మళ్ళీ ఇరవై సోమవారం నాటికి నా డబ్బంతా దమ్మిడీలో ఇచ్చెయ్యాలి" అని జ్ఞాపకం చేసి నా స్నేహితుడితో మూడుసార్లు 'ఇస్తాను' అనిపించుకుని వెళ్ళిపోయాడు సూరయ్య.

అతను ఎప్పుడు వెళతాడా, ఈ తంతేమిటో ఎప్పుడు తెలుసుకుందామా అని కూర్చున్న నేను, అడుగుదామని నా స్నేహితుని వైపుకి తిరిగేటప్పటికి అతడు చేత్తో నన్ను వారించి వాకిలివైపుకి చూపాడు. నేను అటు చూట్టం, సూరయ్య గభాలున తలుపు నెట్టుకుని లోపలకు రావటం ఒకేసారి జరిగింది. మనిషి ఇదివరకుమల్లే లేడు. ఆపాదమస్తకం ఒణికిపోతున్నాడు. కళ్ళు ఎర్రగా జ్యోతులా ఉన్నై. గాలి తెగ పీలుస్తున్నాడు. తల మాత్రం ఓరగానే ఉంది.

ఒక్కక్షణం వాకిటిలో ఆగి రయ్యిన నా స్నేహితుడి మీదకు వచ్చి ఇలా కేకలు వేశాడు "ఏదీ నా డబ్బు? ఎన్నాళ్ళయింది? ఇదిగో అదిగో అంటూ కుక్కని తిప్పుకున్నట్టు నీ ఇంటిచుట్టూ తిప్పుకుంటావా? పరువూ మర్యాదా ఉండక్కర్లా ? కడుపుకి అన్నం తింటున్నావా, గడ్డి తింటున్నావా?"

నిజం చెప్పొద్దూ ఈ మాటలు వినేటపటికి నాకు కంపరం ఎత్తింది, కోపం వచ్చింది. కాని ఏమి చెయ్యటం? గుడ్లు వప్పచెప్పి చూస్తూ కూర్చున్నాను.

నా స్నేహితుడు భయంగా, అతివినయంగా, "ఇదిగో సూరయ్యా, నీ డబ్బు! నాలుగురోజులు ఆలశ్యమైమైనంత మాత్రాన నీ బోటి పెద్ద మనిషి ఇట్లా నోరుపారేసుకోవటం ఏం మర్యాద?" అని తన దగ్గరే ఉన్న ఆ రాళ్ళమూటని ఇచ్చాడు.

"మరి వడ్డీయో? డబ్బు నాకు చేద్దై ఇచ్చాననుకున్నావా? నీ తాతకి అచ్చుండి ఇచ్చాననుకున్నావా? పూర్తి పరిష్కారం చేసి కదులు" అని బొడ్లో చెయ్యేసి నిలవేశాడు సూరయ్య.

"ఇస్తాను సూరయ్యా. మరి ఒదులు" అన్నాడు నా స్నేహితుడు

"తీసుకురా" అని ఒక్కతోపు తోశాడు సూరయ్య.

నా స్నేహితుడు పడబోయి నిభాయించుకుని గోడపక్కకు వెళ్ళి, పదిరాళ్ళు ఏరితెచ్చి సూరయ్య చేతులో పెట్టాడు. సూరయ్య వాటిని లెక్కపెట్టుకుని, నా స్నేహితునితో ఒక్కమాటైనా అనకుండా గిరుక్కున వాకిలివైపుకు తిరిగి తల ఓరగానే ఉంచుకుని గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

నా స్నేహితుడు ఒక్క నిట్టూర్పు విడిచి నేను అడగవలసిన అవసరం లేకుండా తనే ఇలా చెప్పాడు - "పాపం ఏం చెప్పను? ఒకప్పుడు ఈ ఊళ్ళోకల్లా షావుగారు ఈ సూరయ్య. ఇప్పుడు పిచ్చెక్కి ఈ విధంగా తయారయ్యాడు" అన్నాడు.

"ఇతనికి పిచ్చా! ఎందుకెత్తింది! పిచ్చిలో ఇదేమిటి?" అని అడిగాను.

నా స్నేహితుడు సూరయ్యకథ ఈ విధంగా చెప్పాడు:

"సూరయ్య ఈ గతికి రావటానికి అతని తండ్రే కారణం అతని తండ్రి చాలా మంచివాడు. మెత్తని హృదయం కలవాడు. అటువంటి అతడే, కొడుకు పతనానికి కారకుడయ్యాడు."

"అంత మంచివాడు..?"

"చెపుతాను విను. అంతమంచివాడు అవటం వల్ల దానాలు చేసి, అడ్డాలు ఉండీ తన ఆస్తంతా పాడుచేశాడు. ఆస్తిపోయిన తర్వాత పలరించే దిక్కులేకుండా చచ్చిపోయాడు. ఇది కన్నులారా చూచిన సూరయ్యకు సంఘం మీద కసి ఏర్పడటంలో ఆశ్చర్యంలేదు. అందుకని పూర్తిగా తన స్వభావాన్నే మార్చుకుని, పెత్తనానికి వచ్చినప్పటినుంచీ ఘోరంగా సంపాదించటం మొదలు పెట్టాడు. ఉన్న నాలుగెకరాలు అమ్మేసి వడ్డీ వ్యాపారం మొదలుపెట్టాడు. మనుషులతో ఉన్న ఇతరత్రా సంబంధాలన్నీ క్రూరంగా తెగ్గొట్టుకున్నాడు. తనకీ

మిగిలిన మనుషులకీ ఒక్కటే సంబంధం - వడ్డీవ్యాపారం. తాను వడ్డీకి డబ్బు ఇవ్వటానికి పుట్టాడు, మిగిలిన జనం డబ్బు పుచ్చుకుని వడ్డీ ఇచ్చుకోటానికి పుట్టింది.

"ఇట్లా తయారై, మిగిలిన రైతుల్ని పీల్చి పిప్పిచేసి, కొద్ది సంవత్సరాలలోనే ఊళ్ళోకల్లా షావుకారై కూర్చున్నాడు. ఎంత షాహుకారైనా డబ్బు సంపాదించటం అలవాటైన పద్ధతులు ఎలా మారతాయి - కనక డబ్బు అవసరం లేనప్పటికీ కూడా పాత పద్ధతుల మీదే నడిచాడు. పిల్లికి బిచ్చం పెట్టేవాడు కాదు. అడిలి గి పెట్టినా దమ్మిడీ జారనిచ్చేవాడుకాదు. బాకీదార్లని ఎన్ని కష్టాలు పెట్టాలో అన్నీ పెట్టి, ఇన్ని నీళ్ళు కూడా పుట్టకుండా చేసి తన డబ్బు పిండుకునేవాడు. ఆ పిండుకోవటంలో కూడా దయాదాక్షిణ్యాల్లేవు. కొంపలు కూలినా, కుటుంబాలు నాశనమైనా అతని హృదయం కరిగేదికాదు.

"అందుకని అతని డబ్బుతోపాటు, అతని మీద ఊళ్ళో అసూయా, అసహ్యం కూడా పెరుగుతూ వచ్చాయి. అతన్ని చూస్తే భయమే తప్ప ఇష్టం ఒక్క వ్యక్తిక్కూడా లేకుండా పోయింది. సూరయ్య ఇదికూడా మంచిదే అనుకున్నాడు. 'నాక్కావలసింది డబ్బు, వీళ్ళ ఇష్టం ఎవరిక్కావాలి?' అంటూ ఉండేవాడు. పరిస్థితులు ఇట్లా ఉండగా ఒక సంఘటన జరిగింది.

ఈ ఊళ్ళోనే అవతలి వీధిలో చంద్రయ్య అనే రైతు ఉన్నాడు. చంద్రయ్య ఈ సూరయ్యకి రెండువందల రూపాయల బాకీ ఇవ్వతేలాడు. చంద్రయ్య అవటం చిన్న రైతే ఐనా టౌన్తో సంబంధం ఉన్న వాడవటం వల్ల, డబ్బున్నా, కోర్టన్నా లెక్కచేయకుండా ఉండే డబ్బున్నవాళ్ళంటే అసహ్యం ఉంది. భయంలేదు. తనకు అవసరానికి డబ్బిచ్చాడనే విశ్వాసం లేకపోగా తన దగ్గర సూరయ్య అన్యాయంగా డబ్బు దోచుకుంటున్నాడనే భావం, కోపం కలిగినవాడు. సూరయ్య హెచ్చువడ్డీ వస్తుందని అతనికి అప్పుపెట్టాడేగాని, పెట్టిందగ్గరనుంచీ డబ్బు రాదేమో అనే భయంతో అతని ఇంటిచుట్టూ తిరగటం మొదలుపెట్టాడు. ఒకరోజు చంద్రయ్యని నా డబ్బిచ్చి కదలమని నిలవేశాడు. నానా దుర్భాషలూ ఆడాడు; దాంతో లోలోపల రగులుకుంటున్న అగ్ని చంద్రయ్యలో నుంచి గుప్పున బయటపడింది - 'నేను దమ్మిడీ ఇవ్వను. నీ వాళ్ళతో చెప్పుకో! ముందు నువ్వు అవతలకు వెళ్ళు' అని కేకలు వేశాడు.

"పాపం సూరయ్యకు ఇట్లాంటి అనుభవం ఇదివరకెప్పుడూ కలగలేదేమో, చంద్రయ్య మాటలకు నిరుత్తరుడై ఒక్క నిమిషం మాట్లాడలేకపోయాడు.

'వెళ్ళవే!' అని గద్దించాడు చంద్రయ్య. 'చంద్రయ్యా! ఇది నీకు మంచిది కాదు; కోర్టులాగి పప్పు తీయిస్తాను' అన్నాడు సూరయ్య.

'పప్పు తీయిస్తావ్రా మాదచ్చోద్' అని నానా బూతులూ కూసి మెడమీద క్రవేసి బయటకు గెంటాడు చంద్రయ్య.

"ఇక చూడు సూరయ్య సంగతి. సూరయ్యకు శివం ఎత్తింది. పిచ్చి గంగిర్లెత్తినై. కనపడ్డవాడికల్లా చెప్పాడు. 'ధర్మవడ్డీకూడా ఇవ్వడట! అసలే ఇవ్వడట! ఇదెక్కడన్నా ఉందా? రాములవారి కాలం నుంచీ ఈ వడ్డీ ఉందికదా!' అని మొత్తుకున్నాడు.

"తిరిగి తిరిగి ఇంటికి వెళ్ళి గబగబా నాలుగు మెతుకులు నోటిలో వేసుకుని, అంగోస్త్రం నడుంకి కట్టి తెల్లగుడ్డ గొడుగు చంకన పెట్టి టౌన్కి బయలుదేరాడు. అప్పటికీ ఆశ చావక, చంద్రయ్య వాకిలి ముందు సకిలిస్తూ నాలుగైదుసార్లు అటూ ఇటూ పచార్లు చేశాడు. బజార్న పోతున్నవార్ని, నిర్నిమిత్తంగా పిలిచి, 'కొంచెం కోర్టులో పనివుండి టౌనుకి వెళుతున్నాను' అని ఇంటిలో ఉన్న చంద్రయ్యకు వినబడేట్టు చెప్పాడు. 'కోర్టుక్కాదు, నిన్ను పుట్టించిన బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళు. ఈ ఊరు నీళ్ళు నీకు ప్రాప్తం లేదు" అని ఇంటిలో నుంచే కేకేశాడు.

"ఇంకేం చేస్తాడు? ఇక తప్పేదేముంది? చంద్రయ్య మాటలకు మనస్సులో కొంచెం జంకినా డబ్బెలా వదులుకోవటం? మనస్సుని తిట్టి లోబరుచుకుని టౌన్కి వెళ్ళి ప్లీడరుతో మాట్లాడి చంద్రయ్యకి రిజిష్టరు నోటీసు ఇప్పించాడు. నోటీసైతే ఇప్పించాడేగానీ మనస్సులో ఆరాటం హెచ్చింది దిగులు దిగులుగా ఉండి ఏమీ తోచక టౌనులో అటూ ఇటూ తిరిగి ఇంటికి బయలుదేరేటప్పటికి సాయంకాలమైంది.

టౌన్ నుంచి మా ఊరు రావాలంటే రోడ్డు దిగి డొంకలో మైలు నడవాలని నీకు తెలుసు. సూరయ్య డొంక దగ్గరకు వచ్చేటప్పటికి బాగా చీకటిపడ్డది. రోడ్డు దిగేటప్పటికి అతనికి భయంవేసింది. ఆ డొంక మా ఒక్క ఊరికి వచ్చేదే అవటం వల్ల మనుష్య సంచారం తక్కువగా ఉంటుంది. పైగా రెండు పక్కలా కొరివిదయ్యాలు తలలు విరబోసుకునట్లు కనబడే గుబురుగా పెరిగిన చెట్లు. సూరయ్య ధైర్యం చేసి ఆంజనేయ దండకం పఠిస్తూ డొంకలో పదిగజాలు నడిచాడు. ఆ పెద్ద మర్రిచెట్టు చూశావుగా, అక్కడకు వచ్చాడు. అకస్మాత్తుగా పక్క పొదల్లో అలికిడి వినిపించి ఆగిపోయాడు. గొంతులో పాట గొంతులోనే ఆగిపోయింది. వెంటనే అతని కోసం పొదలలో కనిపెట్టుక్కూచున్న, చంద్రయ్య ముఠా పదిమంది అతన్ని కమ్ముకున్నారు. మీదకు దూకారు. చావచితక కొట్టారు. పాపం కిందపడేసి సున్నం మీద ఎముక లేకుండా కొట్టారు. చంద్రయ్య మీదపడి అతని జేబులో ఉన్న ఇరవై రూపాయలూ లాక్కొని, 'దావా వేసి వచ్చావు కదా. దాని ఖర్చెవరు పెట్టుకుంటారు? నీ తాత..?' అని కాలికి వచ్చినట్టు తన్ని, మిగిలిన వాళ్ళని తీసుకుని, సూరయ్యని అక్కడే వదిలి వెళ్ళిపోయారు.

క్షణాలమీద ఈ వార్త ఊరంతా పాక్కింది. 'సూరయ్యని కొట్టారంటే సూరయ్యని కొట్టా'రని ఊరంతా ఆ గుబ్బగా చెప్పుకుంది. కాని ఒక్కడు కూడా జాలి తలిచిన వాడేలేడు. 'పాపం' అన్న పాపాన పోయినవాడే లేరు.

"సూరయ్య భార్య దొడ్డ ఇల్లాలు. కూతురు కూడా చాలా మంచిది, కాని బయట జరిగే దురంతాలను వాళ్ళెలా ఆపగలరు? సూరయ్యని మనస్సుని ఎలా తిప్పగలరు?

"తెల్లగా తెల్లవారింతర్వాత ఊళ్ళో షావుకార్లు సూరయ్యని పరామర్శించటానికి వచ్చారు. సూరయ్యకు ఆ రాత్రంతా నిద్రలేదు. ఏదో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. భార్యా కూతురు నోటికి మూతలేకుండా ఏడుస్తున్నా, వాళ్ళ వంకే చూట్టంలేదు. అన్ని దెబ్బలుతిన్నా ఒక్క మూలుగన్నా మూలగటం లేదు.

"షావుకార్లు వొచ్చి, 'సూరయ్య! ఇక చూస్తూ ఊరుకుంటే లాభం లేదు. క్రిమినల్ కేసు బనాయించి వాళ్ళ అంతు కనుక్కోవలసిందే!' అన్నారు.

"సూరయ్య కొంచెం కదిలి, వాళ్ళని నింపాదిగా చూసి, "ఇంకేం? అందరం చందాలు వేసుకుని వ్యాజ్యమాడదాం" అన్నాడు.

"చందాలు" అనేటప్పటికి షావుకార్లు మొహామొహాలు చూచుకున్నారు. "అదేమిటి సూరయ్యా నిన్ను కొట్టటమేమిటి? మేం చందాలు వేసుకోవటమేమిటి?" అన్నాడు.

"ఈ మాటలకు సూరయ్యకు కోపం వచ్చింది. అంత బాధలోనూ లేచి కూర్చుని, "వాళ్ళు నన్ను కొట్టారా? నా దగ్గరవున్న డబ్బుని కొట్టారు. అంటే ఈ ఊళ్ళో వున్న షావుకార్లందర్నీ కొట్టారు. వడ్డీకోసం అప్పుపెట్టే ప్రతివాడినీ కొట్టారు. వడ్డీకోసం అప్పు పెట్టే ప్రతివాడినీ కొట్టారు. నన్ను కొట్టటమైతే ఒక్క చంద్రయ్యే కొట్టేవాడు, మిగిలిన వాళ్ళంతా ఎందుకు కుమ్ముక్కుచేస్తారు? వాళ్ళ కొట్టగలరు కనక అంతా కలిసి కొట్టారు. మనం చందాలు వేసుకోగలం గనక అంతా కలసి చందాలు వేసుకుందాం" అన్నాడు.

"షావుకార్లకు ఇదేమీ అర్థంకాలేదు. దెబ్బలతో సూరయ్య మతిచెడ్డది అనుకున్నారు. నెమ్మదిగా ఒకరి తర్వాత ఒకరు జారుకున్నారు.

"ఎంతమంది చెప్పినా, ఎంత చెప్పినా సూరయ్య వినలేదు కేసు పెట్టనంటే పెట్టనన్నాడు "నా సొంత డబ్బు తగలేసుకుని, ఈ డబ్బున్న వాళ్ళకోసం వ్యాజ్యం ఆడిపెట్టనా? నే చెయ్యను" అనేవాడు.

కానీ చంద్రయ్య ఏ ముహూర్తాన చెయ్యి చేసుకున్నాడోగాని, అప్పటినుంచీ సూరయ్య దశ తిరిగిపోయింది. దెబ్బలు తిని కేసు పెట్టక పోయేటప్పటికి ఊళ్ళోవాళ్ళకి లొల్లి అయిపోయాడు. తాము ఏ డబ్బుని చూచి భయపడుతున్నారో ఆ డబ్బు సమయానికి సూరయ్యను ఆదుకోలేక పోయేటప్పటికి ఇంకేముంది? పెద్దలు మొదలు కుర్రవాళ్ళవరకూ సూరయ్యని ఆటలు పట్టించటం

మొదలుపెట్టాను. ఇల్లు కదిలితే చాలు "సూరయ్యా వడ్డీ చంద్రయ్యా లాఠీ" అని పిల్లలు చప్పట్లు కొట్టుకుంటూ వెంటపడేవారు. రావలసిన డబ్బు అడిగితే బాకీదార్లు "ఏం తన్నులు కావాలా?" అనేవారు. కొందరు "ఇదిగో అసలు - ఇదిగో వడ్డీ" అని మొట్టికాయలు వేసేవారు కూడాను.

చివరకు సూరయ్యకు చిల్లిగవ్వకూడా వసూలు కాకుండా పోయింది. ఎట్లా వచ్చిన డబ్బు అట్లాగేపోయింది. ఎక్కడ పెట్టిన డబ్బు అక్కడే ఇంకిపోయింది. తనకు తదనంతమయినా వస్తుందనుకున్న ఆస్తిరాకుండా పోయిందని అల్లుడు కూతురుని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టాడు.

సూరయ్య భార్యా మొహం చూడలేక వీలైనంత వరకు ఇంట్లో ఉండకుండా తిరుగుతూ కాలం గడిపేవాడు. నాలుగు మెతుకులు నోటిలో వేసుకొచ్చి చెరువుగట్టుమీద రావిచెట్టుకింద ఒంటరిగా కూర్చునేవాడు. ఇన్ని రాళ్ళు ఏరుకుని ఒక్కొక్కటీ చెర్లో వేస్తూ, అవి నీళ్ళలో పుట్టించే కదలికను పరీక్షిస్తూ కూర్చునేవాడు.

కాని ఊళ్ళో జనం అక్కడ అతన్ని సుఖంగా ఉండనివ్వలేదు. అతడు నిస్సహాయుడౌతున్న కొద్దీ జనం తన బలాన్ని ఎక్కువగా ఉపయోగించటం మొదలు పెట్టింది. జనానికి అతనిమీద కలిగిన కసీ, అలుసూ అతనితోనే ఆగక అతని కుటుంబం మీదకు తిరిగింది.

ఒకరోజు సూరయ్య కూతురు వాములదొడ్లో గేదకు మేత వేస్తుంటే నలుగురు పట్టుకుని గాతంలో పడేసి బలత్కారంగా చెరిచారు. వాళ్ళు విడిచిపెట్టి వెళ్ళిన తర్వాత ఆ పిల్లలేచి, నడవలేక కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి, బావిలోపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంగతి తెలిసి సూరయ్య భార్య అవమానాలు సహించలేక కిరసనాయిలు పోసుకుని కాల్చుకుని మరణించింది. అదే సమయంలో విరోధులు సూరయ్య ఇవ్వవలసిన బాకీలు తన పేర ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఇల్లు వేలం వేయించారు.."

ఇంతవరకూ ఓపికతో విని, ఇక ఆపుకోలేక నేను ఈ ప్రశ్న వేశాను "ఈ ఘోరకృత్యాన్ని జరక్కుండా ఎవ్వరూ ఆపలేదూ?"

"తనన్నవాళ్ళేలేరు. చేసుకునది. అనుభవిస్తున్నాడని కొందరూ, ఈ ఉద్రేకంలో అడ్డు చెపితే తమ కుటుంబాలు సరిగ్గా ఉండవేమో అనే బయంతో కొందరూ మొత్తానికి మెదలకుండా ఊరుకున్నారు."

"ఊఁ! తరువాత ఏం జరిగింది?" అని అడిగాను.

"ఇంకేముంది! డబ్బుదారిన డబ్బు నడిచింది. కూతురు అలా అయిపోయింది. భార్య ఇలా అయిపోయింది. సూరయ్య గుండెలు పగిలిపోయినాయి. ఆవులాగా అడలుతూ, ఊరుపట్టుకు తిరిగేవాడు. కొన్నాళ్ళకు పిచ్చెత్తింది. ఇప్పుడెవరన్నా జాలితలచి ఇన్ని మెతుకులు పెడితే తింటాడు. ఆ చెరువు గట్టుమీద రావి చెట్టుకిందే ఉంటాడు. ఎండలో, వానలో అక్కడే ఉంటాడు. ఎప్పుడూ కూతురు సంగతిగానీ, భార్య సంగతిగానీ ఎత్తడు. ఎవర్నీ పలకరించడు. రోజుకొక్కసారి వెళ్ళి తన పాత ఇంటిని దూరాన్నించి చూచుకుని కన్నీరు పెట్టుకుంటూ ఉంటాడనీ, రాత్రిళ్ళు తనకూతురు పడి ఆత్మహత్య చేసుకున్న బావి దగ్గరకు వెళ్ళి ప్రదక్షిణం చేసి వస్తుంటాడని ఊళ్ళో చెప్పుకుంటూ ఉంటారు... ఇదీ సమాచారం..."

నేను కథంతా ప్రాణాలు బిగపట్టుకుని విన్నాను. సూరయ్య కథ చెప్పమన్నప్పుడు ఇటువంటి విషాదగాథ వింటానికి సిద్ధపడలేదు.

"అలవాటు" అన్నాడు నా స్నేహితుడు "పాత అలవాటుని పట్టి ఇలా చేస్తూ ఉంటాడు. మేం కూడా జాలిపడి అతని మనస్సుని ఈ అవస్థలో కష్టపెట్టడం ఎందుకని తగు విధంగా ప్రవర్తిస్తూ ఉంటాం. ఈ సూరయ్య.."

నా స్నేహితుడు చెబుతూ ఉండగానే వీధిలో పెద్దగోల బయలుదేరింది - "సూరయ్యా వడ్డీ, చంద్రయ్యా లాఠీ," అని కేకలు. బయటినుంచీ సూరయ్య "బే" అని అరిచాడు. ఆ ధ్వని విని మేమిద్దరం బయటకు పరిగెత్తాం.

బయట వీధిలో సూరయ్య రోజుకుంటూ, రొప్పుకుంటూ గబగబా నడుస్తూ వెళుతున్నాడు. చేతిలో నా స్నేహితుడిచ్చిన మూట భద్రంగా ఉంది. వెనక పదిమంది పిల్లలు పోగై గోల చేసుకుంటూ సూరయ్య మీదకు రాళ్ళు విసురుతున్నారు.

నడుస్తూ నడుస్తూ ఉన్న సూరయ్య అకస్మాత్తుగా పరిగెత్తడం మొదలుపెట్టాడు. రయ్యిన పరుగెత్తి ఒక ఇంటిముందు ఆగి, ఒక నిమిషం ఆ ఇంటిని చూచి, అక్కడ నుంచి కదిలి పక్కనే ఉన్న గట్టుమీద నిలబడ్డాడు. పిల్లలంతా ఎక్కడివాళ్ళు అక్కడే ఆగిపోయారు. చేతుల్లో రాళ్ళు చేతుల్లోనే ఉన్నాయి. నేనూ నా స్నేహితుడు ఊపిరి బిగపట్టి చూస్తూ నుంచున్నాం. సూరయ్య వంగి బావిలోకి చూచి లేచి, ఇంటివైపు చూశాడు. ఉండి ఉండి "బే" అని సైరన్ లాగా విన్నవాళ్ళకి సలపరం పుట్టేటట్టు అడిలి రాళ్ళ మూటతో సహా బావిలోకి దూకాడు.

వాళ్ళూ వీళ్ళూ పోగయ్యారు కాని ఏమీ లాభం లేకపోయింది. నా స్నేహితుడికిచ్చిన రాళ్ళమూట తేలినివ్వక పోయింది. శవం బయటకి వచ్చింది. తర్వాత - మేం ఇంటికి వచ్చిన తర్వాత నా స్నేహితుడు చెప్పాడు "ఆ ఎదురుగా ఉన్న ఇల్లే అతని ఇల్లు. అతడు దూకిన బావే అతని కూతురు ఆత్మహత్య చేసుకున్న బావి." !!

✡✡✡